# ఒంటరి మేక

శ్రీకాంత్ కొత్తగా గ్రాడ్యుయేటయ్యారు ఇలాప్యాసవగానే అలా ఉద్యోగం వచ్చిందతడికి- అదీ సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగం. అతడి అదృష్టాన్ని బంధువులూ. మిత్రులూ అభినందించారు. శ్రీకాంత్ తన అదృష్టానికి పొంగి పోయాడు. అయితే అందుక్కారణాలు వేరు.

శ్రీకాంత్‌ది వేడిరక్తం. కాలేజీలో చదువుకునేటప్పుడు డిబేట్సులో ఎప్పుడూ అతడిదే మొదటి బహూమతి. అతడు వరకట్నాన్ని నిరసిస్తూ ఎంతో గొప్పగా ఉపన్యసించేవారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించే ఉపాయం ఉద్యోగం కోసం ఎక్కువకాలం ఎక్కువ కాలం ఎదురు చూడక పోవడమేననేవాడు. అవినీతిని ఎదిరించే ధైర్యాన్ని యువతరం అలవాటు చేసుకోవాలనేవాడు. నాయకత్వం లేకపోయినా ప్రతిదేశ పౌరుడూ ... తనేదేశ నాయకుడిననుకుని ప్రతి సమస్యకూ పరిష్కారమార్గం ఆలోచించాలి.

శ్రీకాంత్ కిద్దరు స్నేహితులున్నారు. చలపతి, గణపతి వాళ్ళపేర్లు. వాళ్ళిద్దరూ ఎప్పుడూ జంటగా ఉండేవారు. ఎంతో సరదాగా మాట్లాడేవారు. ఎలాంటి వాడినయినా మాటలతో బోల్తా కొట్టించేవారు. విడివిడిగా ఉంటేనే వాళ్ళ చురుకుతనానికి తట్టుకోవడంకష్టం. వాళ్ళిద్దరూ కలిసుండగా వాళ్ళను పలకరించాలంటేనే చాలామంది భయపడేవారు. వాళ్ళుమాత్రం రోజు కొకడినైనా ఎలాగో అలా వెతికి పట్టుకుని వినోదించేవారు. వాళ్ళకో మనిషి దొరికాక .... ఆవినోదంలో పాలుపంచుకోవడానికి మిగత వాళ్ళు వాళ్ళ చుట్టూ మూగేవారు. వాళ్ళేమన్నా నవ్వేసి, ఆరాధనా పూర్వకంగా చూసి....వాళ్ళను మరింతగా రెచ్చగొట్టి ప్రోత్సహించే వారు.


చలపతి, గణపతి....ఇద్దరూ కూడా శ్రీకాంత్‌ను ఆరాధిస్తున్నామనే వారు. అతడి ఉపన్యాసాల నెంతగానో మెచ్చుకునేవారు.

"మీకు నా ఉపన్యాసాలు నచ్చడం నా అదృష్టం..." అని శ్రీకాంత్ వారితో మొదటిసారి అన్నప్పుడు వాళ్ళునవ్వారు.

"తలచుకుంటే మే మెవరినైనా ఏడిపించగలం. కానీ ఈ ప్రపంచంలో దేనికైనా విచక్షణ ఉండాలి. మేము నీ జోలికిరావడం లేదంటే అందుక్కారణం మా విచక్షణ కూడా ! ఒకరోజున నువ్వు తప్పక గొప్పవాడివౌతావు. మేము నీ అంత గొప్పవాళ్ళం కాలేము. అప్పుడు మాకు నీ అవసరముంటుంది. అందుకే ఇప్పట్నించీ చెంచాగిరీ చేస్తున్నాం...." అన్నాడు చలపతి.

"నేను గొప్పవాడి నౌతానని మీకెలా తెలుసు ?" అన్నాడు శ్రీకాంత్.

"నువ్వు వరకట్నాన్ని నిరసించేవు. కానీ చదువయ్యేక తప్పక కట్నాన్నాశిస్తావు. ఎవరికాళ్ళ మీద వాళ్ళు నిలబడాలని ఉపన్యాసమిచ్చినా ఉద్యోగం కోసం ఏమైనా చేస్తావు. ఎంతకాలమైనా ఎదురుచూస్తావు. అవినీతిని ఎదిరించాలని ఇప్పుడంటున్నావు. అంటే నిన్నే ఎదిరించాలన్న పరిస్థితిసృష్టిస్తావు. మూఢనమ్మకాలకు స్వస్తిచెప్పాలన్నావు. ఏటా తిరుపతి వెడతావు. బాబాలను



నమ్ముతావు. ఇంట్లో సత్యనారాయణవ్రతాలు చేస్తావు...." అన్నాడు గణపతి.

శ్రీకాంత్ ముఖం ఎర్రబడింది — "ఇలా జరుగుతుందని మీ కెలాతెలుసు ?

"ఈనాడు కాలేజీలలో యువతరానికి ప్రాతినిధ్యం వహించేవారి లక్షణాలుయివి!" అన్నాడు చలపతి.

"అయితే నేను గొప్పవాడి నెలా నౌతాను ?"

"చెప్పింది చేయకపోవడం గొప్పవాళ్ళ లక్షణం...." అన్నాడు గణపతి.

"అయితే అలాంటి వాళ్ళు కాలేజీలో చాలామంది ఉన్నారు. వాళ్ళందరూ కూడా గొప్పవాళ్ళవుతారా ?" అన్నాడు శ్రీకాంత్.

"అందరూ ఎందుకవుతారు ? ప్రజల్లో రెండేరెండు రకాలు. ఒకరు వేదికలెక్కే వారు. ఇంకోరు చప్పట్లు కొట్టేవారు

వసుంధర



మొదటిరకం వారు నాయకులవుతారు. రెండవ రకంవారు ఓటర్లవుతారు......" అన్నాడు చలపతి.

"మీ మాటల్ని నేనుసవాలుగా తీసుకుంటాను.........."

"వద్దు అప్పుడు మేము నీకు చెంచాగిరీ [illegible]ల్సొస్తుంది. ఒక్క విషయం గుర్తుంచుకో ! తాను చెప్పిన ఆదర్శాలుతానే ఆచరించాలనుకునే వాడికి చెంచాలుండరు" అన్నాడు గణపతి.

అప్పుడు శ్రీకాంత్‌లో ఆత్మవిమర్శ ప్రారంభమయింది. తాను అందరికిలా ఉండకూడదని నిర్ణయించుకున్నాడతడు.

శ్రీకాంత్‌కి ఆ ఊళ్లోనే ఇంటర్మీడియట్ చదువుతున్న మరదలుంది. ఆమె పేరు మాణిక్యం. చాలా అందంగా ఉంటుంది. అయితే శ్రీకాంత్ తల్లిదండ్రులామెను కోడలిగా చేసుకోరు. వాళ్ళకు కట్నం కావాలి. మాణిక్యం తండ్రి కట్నమివ్వలేడు.

శ్రీకాంత్ మాణిక్యాన్ని వివాహం చేసుకోవాలనుకున్నాడు. అందువల్ల ఇంట్లో వాళ్ళతో గొడవవుతుంది. ఇంట్లోంచి బయటకు పోవలసిరావచ్చు. కాబట్టి తన కాళ్ళమీదతను నిలబడే వరకూ పెళ్ళి చేసుకో కూడదన్నాడు. ఈ విషయాన్నతడు మాణిక్యానికి మాత్రం చెప్పాడు. మాణిక్యం అతడి మీద ఆశలు పెంచుకుంటోంది.

అలాంటి సమయంలో ఉద్యోగంరావడం అదృష్టమే గా ! ఆ అదృష్టం కూడా ఒక రకంగాకాదు.

ఉద్యోగంకోసం ఏమైనా చేస్తానని, ఎంతకాలమైనా ఎదురుచూస్తాననీ స్నేహితులున్నారు. ఉద్యోగం గురించి అతను చేసిందల్లా అప్లికేషను పెట్టడంమాత్రమే ! ఎదురుచూసింది ఆరునెలలు మాత్రమే. ఇంకావిశేషం అది అవినీతి నిరోధకశాఖకు సంబంధించినది.

చలపతి, గణపతి శ్రీకాంత్‌ని అభినందించారు.

"ఈ రోజుల్లో ఎమ్మేలూ, పీ. హెచ్.డీలూ చేసినవాళ్ళకే ఉద్యోగాలు దొరకడంలేదు. బియ్యే ప్యాసవగానే ఉదోగ్యం దొరికిదంటే నువ్వు చాలా గొప్పవాడికిందే లెక్క !" అన్నాడు చలవతి.

అవినీతి నిరోధకశాఖ గదా అని అవినీతిని ఎదిరించకు. ఉద్యోగం ఊడుతుంది. అని హెచ్చరించాడు గణపతి.

"కాలేజీ రోజుల్లో పదిమందికీ నేనేం చెప్పానో అవన్నీ ఒకటొక్కటిగా చేసి చూపిస్తాను...." అన్నాడు శ్రీకాంత్.

"కాఫీ వేడిగా ఉంటేనేరుచి. అయితే



# చీరలు

సూర్యకాంతులు, వెన్నెలలు
విరజిమే రంగులు మరియు ఎన్నో రకాల
డిజైన్లు సంవత్సరము పొడుగునా వచ్చే
ఏ పండగకైనా సరే మీ ఇష్టమైన
వాటిని ఎంచుకొనుటకు విచ్చేయండి.

వెంకటరమణ
బనారస్ సిల్క్ హౌస్
(గద్వాల్ వారి).
జనరల్ బజార్, సికింద్రాబాదు. ఫోను :– 73548


ఊదుకునితాగాలి. నీరక్తంవేడిగా కనబడవి. కాని అవసరమైనంత మటుక్కు ఊది చల్లార్చుకుంటూండు....” అన్నాడు చలపతి.

“నువ్వు త్వరగాపైకొచ్చి మాకేదైనా సిఫారసు చేస్తావని ఎదురు చూస్తున్నాం. మాకన్యాయం చేయకు......” అన్నాడు గణపతి.

శ్రీకాంత్ ఉద్యోగంలో చేరాడు. చేరిన రెండు నెలలకే తను మాణిక్యాన్ని వివాహం చేసుకుంటానని ఇంట్లో చెప్పాడు. పెద్ద గొడవయింది. ఆఖరికతడు గుళ్ళో పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళికి చలపతి, గణపతి వచ్చి అతడిని మనసారా అభినందించారు.

“నీ భార్య అందమైనది. నీవు వరకట్నాన్ని నిరసించడానికి కారణం ఆదర్శమా ఆమె అందమా అన్న విషయం ముమ్ముందు కాలమే చెబుతుందీ....” అన్నాడు చలపతి.

“కాలమేం చెబుతుందో నాకు తెలుసు. అన్ని ఆదర్శాలకూ ఇలాంటి ఇన్‌స్పిరేషన్ దొరకదు....” అన్నాడు గణపతి.

శ్రీకాంత్ వారి మాటలను సవాలుగా తీసుకున్నాడు. అది అతడిలో ఆవేశాన్ని పెంచింది. ఆ ఆవేశంలోనే అతడు తన డ్యూటీని చేయసాగాడు.

అక్కడే అతడి సమస్య ప్రారంభమయింది.

అతడి బాస్‌పేరు జయదేవ్!

జయదేవ్ మనిషిగా మంచివాడు. అవినీతిని ఎదిరించాలన్నది అతడి సంకల్పం. అంతవరకూ బాగానే ఉంది.

కానీ అతడిలో ఓ బలహీనత ఉంది. అతడు పొగడ్తలకు లొంగిపోతాడు. పొగిడే వాళ్ళను నమ్ముతాడు. నమ్మకపోయినా వారంటే యిష్టపడతాడు.

జయదేవ్ అవినీతి నిరోధక శాఖలో ఉన్నతాధికారి దేశంలో అవినీతి పరుల సంఖ్య ఎక్కువ వారిలో ఎక్కువమంది గొప్పవారుకూడా. ఎందుకంటే నీతిని నమ్ముకున్న వారికంటె అవినీతిని నమ్ముకున్నవారికే గొప్పవారయ్యే అవకాశాలెక్కువ.

ఇది చదివి దేశంనిండా గొప్పవారే ఉన్నారా...అయితే దేశంలో ఈ పేదరికమేమిటి, బిచ్చగాళ్ళెవ్వరు. మురికివాడలెక్కడివి...అంటూ చాలామంది ఆగ్రహించవచ్చు. దేశంలో సుమారు అరవైశాతం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు: వారు మనుషులకింద లెక్కరాదు. మిగతానలభైశాతంలో పదిశాతం దారిద్ర్యరేఖపైన ఉన్నారు. వాళ్ళు లెక్కకు మాత్రమే మనుషులు. వీరిలో అవినీతి లేదనలేము. కాని అవినీతిని నమ్ముకుని గొప్ప వాళ్ళు కావడమెలాగో వారికి తెలియదు.

మిగిలిన ముప్ఫైశాతంలో నీతిని నమ్ముకున్నవారి సంఖ్య వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. అంతా అవినీతిని నమ్ముకున్నవారే. పైకిపోదామనుకునే వారే! దేశంలో పరిస్థితి క్రమంగా మెరుగవుతోంది.

అందువల్ల మనుషులుగా ఎన్నతగ్గ అవినీతు పరులందరూ తరచుగా జయదేవ్‌ని కలుసుకునే వారు. వారికి అతడి బలహీనత త్వరలోనే తెలిసిపోయింది. అనతికాలంలోనే పొగడ్తలను వినడం జయదేవ్‌కు అలవాటుగా మారింది. ఆరునెలల సావాసం తర్వాత అతడు కూడా అవినీతి పరుడుగామారాడు.

జయదేవ్ ఆఫీసులోని ఉద్యోగులకు కూడా బాస్ బలహీనత తెలిసిపోయింది. వారంతా యథాశక్తి రోజంతా అతడిని పొగుడుతూండేవారు. బాగాపనిచేస్తున్నారన్న అభినందనలు బాస్‌నుంచి పొందుతూండేవారు.


ఈ వాతావరణంలోకి శ్రీకాంత్ అడుగు పెట్టాడు. పరిస్థితినతడాకళింపు చేసుకున్నాడు.

ఆఫీసులో అంతా బానిస వాతావరణం.

జయదేవ్ ఆఫీసులో అడుగుపెట్టగానే మొత్తం ఉద్యోగులందరూ లేచి నిలబడాలి. జయదేవ్‌తో మాట్లాడేటప్పుడు తాము వాడే ప్రతి వాక్యంచివరా సర్ ఉపయోగించాలి. రాజకీయాలనుంచి, విజ్ఞానశాస్త్రం వరకూ అతడేంచెబితే అదివిని....అతడి అభిప్రాయాలతో ఏకీభవించాలి అతడి పరిజ్ఞానానికి ఆశ్చర్యపడాలి. అతడి గొప్పతనాన్ని పొగడాలి. ఆఫీసు వ్యవహారాల్లో కూడా.... రూల్సుకు వ్యతిరేకంగా ఉన్నా సరే–అతడు చెప్పిందానికి ఒప్పుకోవాలి. చెప్పింది మరీ దారుణంగా ఉంటే అప్పటికి ఒప్పేసుకుని–తర్వాత మంచిమూడ్‌లో ఉన్నప్పుడు అతడికి నచ్చజెప్పాలి. ఆ కారణంగా అతడు తిట్టినా నవ్వుతూ భరించాలి.

శ్రీకాంత్ ఉద్యోగులందర్నీ ఒకచోట చేర్చి.... “ఆఫీసరంటే మనకు యజమాని కాడు. మనమాయనకు బానిసలంకాము. అందరమూ ఒకేసంస్థలోని సహోద్యోగులం. మనమందరం స్నేహితుల్లాగుండాలి. ఇక్కడి పద్ధతినాకు నచ్చలేదు......” అన్నాడు.

“కొత్తలో మాకూనచ్చలేదు. ఇప్పుడల



"నా వైపోయింది...." అన్నారు చాలామంది.

మరికొందరైతే... "ఇదిస్వతహాగా అతడికి పుట్టిన బుద్ధికాదు. స్వార్థంకోసం మనవాళ్ళే అలవాటు చేశారు..." అన్నారు.

"తప్పెవరిదీ అన్నది సమస్యకాదు. తప్పు జరక్కుండా చూడాలి...." అన్నాడు శ్రీకాంత్.

"అందుకేం చేయాలి ?" అన్నాడో సహోద్యోగి.

"ఆఫీసరు వస్తే మనం మనపని చేసుకునిపోవాలి తప్పలేచి నిలబడకూడదు. అతడిని స్నేహితుడిలా చూడాలి తప్ప మాటిమాటికీ సర్ అనకూడదు. అతడిలో తప్పుంటే నిర్భయంగా చెప్పగలగాలి..."

"ఇవన్నీ చేయాలని మాకు ఉంది. కానీ చేస్తే ఏ మవుతుందోనని భయం !"

"ఒకసారి చేసి చూస్తే తెలుస్తుందిగా!"

"తెలుస్తుంది. కానీ పిల్లి మెడలో ఎవరు గంటకడతారు ?"

"నేను కడతాను......" అన్నాడు శ్రీకాంత్.

మర్నాడతడు జయదేవ్ ఆఫీసుకు వచ్చినపుడు లేచినిలబడలేదు. మిగతా వాళ్ళంతా లేచి నిలబడ్డారు. జయదేవ్ని గమనించి అతడికి దగ్గరగావచ్చినిలబడ్డాడు. అప్పుడు శ్రీకాంత్ తలెత్తి ఆఫీసర్ని చూసి "గుడ్ మార్నింగ్ !" అన్నాడు. అప్పుడు కూడా అతడు లేచినిలబడలేదు. పైగా ఆఫీసర్ని సర్ అనలేదు.

జయదేవ్లో ఆవేశం పొంగింది. అతడు చరచరా తనగదిలోకి వెళ్ళిపోయాడు. సహోద్యోగులందరూ శ్రీకాంత్ని అభినందించారు. శ్రీకాంత్ వెంటనే.... "నాకు అభినందలు చెప్పే పద్ధతి ఇదికాదు. మీరు కూడా నా పద్ధతినే అనుసరించాలి...." అన్నాడు.

"కొన్నాళ్ళపాటు నీ అనుభవాలు చూసేక ....అప్పుడు !" అన్నాడో సహోద్యోగి.

"మనమంతా కలిసికట్టుగా ఒకలాగునే ఉంటే ఆఫీసరు భయపడతాడు. లేకుంటే మీనుంచి నన్ను వేరుచేసి విరిచిపారేస్తాడు.." అన్నాడు శ్రీకాంత్.

"నీకు భయంగా ఉంటే నువ్వూమాతో కలిసి మా పద్ధతులనుసరించు. సుఖజీవితానికి అలవాటు పడ్డాం. కొరివితో తలగోక్కోలేం...." అన్నారు సహోద్యోగులు.

ఇది సవాలుగా తీసుకున్నాడు శ్రీకాంత్ "నాకేం భయంలేదు. మీ తోడులేకున్నా నాపద్ధతిలో నేను బ్రతకగలను. నాకు ఆత్మగౌరవం ముఖ్యం !" అన్నాడతడు.

అయితే అతడికి ఆశ్చర్యంగా ఉంది.

అక్కడ సుమారు యాభైమంది ఉద్యోగులున్నారు. వారిలో నలుగురి వయసు మాత్రం యాభైదాటింది. నలభై దాటినవారు ఆగుగుతున్నారు. మిగతా అందరి వయసూ ముప్ఫైకిలోపే !

వారెంత చచ్చుబడిపోయారు ?

సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసులో ఉద్యోగం చేస్తూకూడ ఆత్మగౌరవంగురించి ఒక్క క్షణం ఆలోచించలేని దశకు జారిపోయిందా...యువతరం !

అధికారికి బానిసత్వం నెరపడమే తమ ఉద్యోగంగా భావించే యువతరం ... స్వతంత్ర దేశంలో ఉంటేనేం....పరాయి పాలనలో ఉంటేనేం ?

తామందరూ కలిస్తే అధికారి గజగజలాడుతాడు, గడగడ వణుకుతాడు.

కానీ ఎవ్వరూ తనలో కలవరు.

శ్రీకాంత్ భయపడలేదు. అతడు తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేయసాగాడు.

ఆరంభంలో జయదేవ్ ఇది సహించాడు. శ్రీకాంత్ తన్నుతాను సంస్కరించుకోగలడని ఆశించాడు. అలా జరక్కపోయే సరికి ఆగ్రహించాడు.

చేసిన తప్పును .... తప్పు అనివేలెత్తి చూడలేనప్పుడు .... చేయనితప్పును విధించడం అధికారుల లక్షణం.

జయదేవ్ అదే చేశాడు.

రోజూ ఏదో సమయంలో శ్రీకాంత్కు ఆఫీసర్నుంచి అక్షింతలు పడుతూండేవి. శ్రీకాంత్ వాటికి ఘాటుగానే సమాధానమిచ్చేవాడు.

అయితే....

తోడేలు .... మేకపిల్ల కథ అందరికీ తెలుసు.

ఎగువన ఉన్న తోడేలు దిగువన ఉన్న మేకపిల్లతో... "నువ్వు నానీళ్ళు ఎంగిలి చేస్తున్నావు... ?" అంది.

"ప్రవాహం నీ నుంచి నావైపు కదా వస్తున్నది !" అంది మేకపిల్ల.

"ఆర్నెల్ల క్రితం నువ్వు నన్ను తిట్టావు...." అంది తోడేలు.

"నేనుపుట్టి నాలుగు నెలలైనా కాలేదే... ఆర్నెల్ల క్రితం ఎలాతిట్టగలను ?" అంది మేకపిల్ల.

మేకపిల్ల జవాబుల్లో న్యాయముంది. తర్కముంది. ఈ రెండూ కలవడం వల్ల అమాయకత్వమూ ఉంది. అది ఒంటరి మేక ! దాని జవాబులు దాన్ని రక్షించవు.

"నువ్వుకాకపోతే నీ అమ్మ తిట్టింది..." అంటూ మేకపిల్ల మీదకు దూకింది తోడేలు.

తోడేలుమాటల్లో న్యాయంలేదు. తర్కంలేదు. కానీ దానికి బలముంది. ఆ బలం దాని మాటలకూ బలాన్నిచ్చింది.

చేయని తప్పును ఒప్పుకుని వినయంగా అక్కణ్ణించి తొలగిపోయుంటే మేకపిల్ల ప్రాణాలు రక్షించబడి ఉండేవేమో !

ఇదే కథ అన్నిరంగాల్లో కనబడుతుంది ఇక్కడ జయదేవ్ తోడేలు. శ్రీకాంత్ మేకపిల్ల.

జయదేవ్ అతడిని వేటాడడం ప్రారంభించాడు.

మందనుంచి విడివడిన ఒంటరి మేకను వేటాడ్డం తోడేలుకెంతో సులభం.

ఆఫీసులో శ్రీకాంత్‌కి కష్టాలు ప్రారంభమయ్యాయి.

అక్కడ ఏ తప్పు జరిగినా అతడి బాధ్యతవుతోంది. అందరి ముందూ ప్రతి రోజూ అవమానమవుతోంది. తరచుగా పై నుంచి మెమోలొస్తున్నాయి.

"నీ పద్ధతి మార్చుకో! లేదంటే నీకు భవిష్యత్తులేదు!" అని సహోద్యోగులు హెచ్చరించారు.

శ్రీకాంత్ తన పద్ధతి మార్చుకోలేదు. అతడు జయదేవ్ గురించి పై అధికారులకు రాశాడు. దానికి జవాబురాలేదు. ఇంకా పై అధికారులకు రాశాడు. దానికి జవాబులేదు. ఆఖరికి మంత్రికి ఉత్తరం రాశాడు .... ఎక్నాలెడ్జిమెంట్ పెట్టి రిజిస్టర్ కవరొకటి! ఎక్నాలెడ్జిమెంటుకార్డు మాత్రం వచ్చిందతనికి.

ఆపైన అతడు జయదేవ్ గురించి పత్రికలవారికి సమాచార మివ్వాలనుకున్నాడు. అయితే పత్రికలవారికి జయదేవ్‌కి అవినాభావ సంబంధమున్నది. పత్రికలు... తమకు దక్కలేని విధంగానూ, పాఠకుల సంఖ్యను పెంచే విధంగానూ మాత్రమే అవినీతి గురించి వ్రాస్తాయి. కొన్ని పత్రికలకు రాజీవ్‌గాంధీలో అన్నీ తప్పులు కనబడతాయి. కొన్ని పత్రికలకు ఎన్టీఆర్ తప్పులపుట్టగా అనిపిస్తాడు. ఇద్దర్నీ సదవగాహనతో అర్థంచేసుకుని పాఠకుల ముందు నిష్పాక్షికమైన వార్తలు, అభిప్రాయాలు ఉంచాలనుకునే పత్రికలు అరుదు. అరుదైన ఆ ప్రతికలలో సహా ఏపత్రికకూ శ్రీకాంత్ పై ఆసక్తిలేదు.

జయదేవ్ బలవంతుడు. బలవంతుడితో బలవంతుడు కూడా విరోధాన్ని కోరడు.

ఫలితంగా శ్రీకాంత్‌కు ఆఫీసు నరకమైంది.

ఎప్పటి కప్పుడు తనసమస్యను చలపతి, గణపతికు చెప్పుకుంటూనే ఉండేవాడు శ్రీకాంత్. వాళ్ళిద్దరూ ఇప్పుడు ప్రయివేటుగా ఎమ్మేకూడా పూర్తిచేశారు. ఇంకా ఉద్యోగాలు లేవు.

"ఉద్యోగమొక అమృతభాండం. ఏదో విధంగా దాన్ని కాపాడుకో..." అన్నాడు చలపతి.

"నీ ఆఫీసరు నిన్నెలా క్షమిస్తాడు? నువ్వు తప్ప ఆయన్ను విరసించినవాడొక్కడు కూడా లేడు...." అన్నాడు గణపతి.

"నేను నా ఆదర్శాలు విడువను..." అన్నాడు శ్రీకాంత్.

ఒకరోజున ఉన్నట్లుండి వాళ్ళిద్దరూ శ్రీకాంత్ దగ్గరకు వచ్చారు.

"శ్రాద్ధపురంలో గోవిందబాబా నిజంగా ప్రత్యక్షదైవం. నీ ఇతర ఆదరాలను కాపాడుకోవాలంటే ..నువ్వు మూఢనమ్మకమును కొట్టిపారేయక...ఆయన్ను నమ్ముకోవాలి".... అన్నారు వాళ్ళిద్దరూ ఏక కంఠంతో.

గోవిందబాబాను నమ్మినవారిలో సైంటిస్టులున్నారు. మంత్రులున్నారు, విదేశీయులు కూడా ఉన్నారు. తన భక్తులకాయన ఇవ్వగలవరాలు అపూర్వమైనవి. అమృతమైనవి.

"నేను నమ్మను.." అన్నాడు శ్రీకాంత్.

"మా అనుభవం విను..." అన్నాడు చలపతి.

వాళ్ళిద్దరూ శ్రాద్ధపురం వెళ్ళి గోవిందబాబాను కలుసుకుని తమ గోడు చెప్పుకున్నారు. ఆయన చిరునవ్వులో అంతావిని- "ఈ సారి మీరుద్యోగానికి అప్లై చేసేటప్పుడు....అప్లికేషను ఆ సంస్థకుకాక నాకు పంపండి...." అన్నాడు. ఏ పుట్టలో ఏ పాముందోనని అలాగే చేశాం. ఆయన ఆశీర్వాదంతో ఆ అప్లికేషన్ను ఆ సంస్థకు వెళ్ళాయి. వాళ్ళకు ఇంటర్వ్యూ వచ్చింది. ఉద్యోగమూ దొరికింది.

శ్రీకాంత్ ఆశ్చర్యంగా.... "ఇదెలా జరిగింది?" అన్నాడు.

"అంతా బాబా మహిమ, నామాటవిని నువ్వూ అయన్ను నమ్ముకో. ఆయన వద్దకు వెళ్ళి గోడుచెప్పుకో..." అన్నాడు గణపతి.

శ్రీకాంత్ ఆలోచనలోపడ్డాడు.

జయదేవ్ బలవంతుడు. ఈ సమాజంలో అనుచరులు, అవినీతి పరులు, అధికారులు, రాజకీయనాయకులు, ప్రభుత్వాధినేతలూ.... అందరూ అతడి వెనుక ఉండి బలాన్నిస్తున్నారు. తానేమో ఒంటరి మేక!

జయదేవ్‌ని తానెదిరించాలంటే అందుకు దైవ సహాయంతప్పదేమో?

ఇందులో పెద్దగాతన ఆదర్శం దెబ్బతినేదేమీలేదు. మేలు జరిగిందా .... అందువల్ల తానుఒక్కడేకాదు .... యావద్భారతమూ ప్రయోజనం పొందుతుంది! మేలు జరుగలేదూ...గోవిందబాబాలో గొప్పతనంలేదని ఋజువయింది.

శ్రీకాంత్ చలపతికీ, గణపతికీ, ధన్యవాదాలు చెప్పుకున్నాడు.

ఒక శుభముహూర్తాన ఆఖరి ఆశగా అతడు శ్రాద్ధపురం వెళ్ళాడు. అక్కడ గోవిందబాబా ఆశ్రమానికి వెళ్ళాడు.

అతడు వెళ్ళిన రోజున ఆశ్రమంలో దేశక్షేమము గురించి ప్రత్యేకమైన భజన జరుగుతోంది. వేదికపై గోవిందబాబా గొంతెత్తి పాడుతూంటే కొందరు భక్తవరేణ్యులు ఆయన చుట్టూ ఉండి ఆయనతో గొంతు కలుపుతున్నారు.

శ్రీకాంత్ తనూ వెళ్ళి ప్రేక్షకుల్లో కూర్చున్నాడు. ప్రేక్షకులందరూ భక్తిపారవశ్యంలో తల లాడిస్తూంటే అతడిలోనూ భక్త్యావేశం పుట్టింది. ఆవాతావరణం అద్భుతంగా ఉంది. అప్పుడే అతడిలో గోవిందబాబా పై నమ్మకం కూడా ప్రారంభమయింది. కానీ అప్పుడే....

శ్రీకాంత్ ఉలిక్కిపడ్డాడు.

అందుక్కారణం....

గోవిందబాబా చుట్టూ ఉన్న భక్తుల్లో.... పారవశ్యంతో బాబాతో గొంతు కలుపుతున్న జయదేవ్‌ను అప్పుడే అతడుచూశాడు.

